# పొగమంచు

పొగమంచులోంచి చూడ్డం నాకలవా టైపోయింది - నా కళ్ళకి. జడ్జీ బట్టతలమీద కుడిపక్క ఊడకండా మిగిలిన వెంట్రుకల వరసకి కొంచెం పైన, చంద్రుడు పెచ్చుకట్టింది. కుడి చూపుడు వేలు గోటితో వొలుస్తున్నాడు దాన్ని జడ్జి. ఎప్పుడూ వొలుస్తూంటాడు. అది ఊడి మళ్ళీ వొస్తూంటుంది-మళ్ళీ వొలుస్తాడు. పాపం అలవాటతనికి. నేను జాలిగా నవ్వాననుకుంటా. సుందరం ఆత్రంగా కళ్ళతో అడిగాడు- నేనక్కర్లేదన్నట్టు తల ఊపాను.

అతని చెయ్యి జేబులోకి-కోటు జేబులోకి పోయింది- సిరింజ్ తియ్యి డానికి. అవతలి జేబులో ఉంది పెతిడ్రిన్ ట్యూబ్. నేను తల ఊపితే చాలు- ఎవ్వరికీ తెలీకుండా నా జబ్బలోకి ఎక్కించేస్తాడు సుందరం. ఇంజక్షన్ ఇవ్వగానే కొంచెం పొగమంచు కరిగిపోతుందో-మరి కాస్త దట్టమౌతుందో- మహా సుఖంగా ఉంటుంది. అది కావాలని మనస్సుకి తోస్తే మెదడులో సుత్తి దెబ్బలు - మెత్తగా సమతాళంలో పడతాయి - పెతిడ్రిన్ - పెతిడ్రిన్ - పెతిడ్రిన్.

జడ్జి తలమీద చంద్రుడు పీకినచోట చిన్న రక్తపుబొట్టు పైకుబికింది. పాపం నా మూలంగా అతనికి అవసరమైన మనస్తాపం. సుందరాని కందరి కంటే ఎక్కువ. నాకు తాళి గట్టిన భర్త. నేనంటే ఎంత అక్కర ! పాపం చిక్కి సగమయ్యాడు - నా కోసం. అయినా అతను మనస్తాపం ముఖంమీద కనబడనివ్వడు. మేలుకుని అతి చురుగ్గా ఉంటాయి అతని చూపులు. ఎంత ప్రశాంతంగా, ఎంత జాలిగా చూడగలడు! బుద్ధుడిలాగ!

పాపం ప్రాసెక్యూటర్ ఎంత అవస్థ పడుతున్నాడో, హత్య నేను చేశానని రుజువు చెయ్యడానికి ? ఎందు కింత తంతు, నే నొప్పుకున్నాక? నే నొప్పుకున్నాక కూడా, ఇంకా కోర్టువారికి రుజువు కావాలట- 'అనుమానం లేకండా రుజువు కావాలట.'

"డాక్టర్ సుందరంగారి వాఙ్మూలం ప్రకారం .... ముద్దాయి అయిన డాక్టర్ ఆత్మప్రభ...."

ఆ రోజుల్లో సుందరం నన్ను "ఆత్మా !" అని పిలిచేవాడు. ఇప్పుడు "ప్రభా" అంటున్నాడు - నాలోంచి 'ఆత్మ' లోపించినట్టు.

చటుక్కుని పొగమంచుదట్టమైంది. మెత్తని సుత్తిదెబ్బలు- పెతిడ్రిన్- పెతిడ్రిన్ అంటూ మోగాయి. కొంచెం తూలానేమో. సుందరం వేళ్ళు నా

జబ్బుని పట్టుకున్నాయి - విరాగంగా - కేవల వైద్య ధర్మంలో - సూది హాయిగా చురుక్కుమంది.

పొగమంచు పల్చబడింది. సుందరం వేళ్ళు నా జబ్బ నింకా బలంగా పట్టుకునే ఉన్నాయి. వాటి స్పర్శలో విద్యుత్తు ఇప్పుడు లేదు. ఒకప్పుడు - అప్పుడు - ఉస్మానియా ఆస్పత్రిలో - మొదటిసారి ఆ వేళ్ళు నన్ను అనుకోకుండా తాకినప్పుడు-అబ్బ !....ఎంత విద్యుత్తు ప్రవహించింది నాలో. ఒడలంతా వివశమైపోయింది.

ఆరు సంవత్సరాలు - ఆ తరవాత తాకినప్పుడల్లా ప్రవహిస్తూనే ఉండేది. జీవితాంతం అలాగే ఉండును-కన్నయ్య నాయుడు ఆపరేషన్‌కోసం ఆస్పత్రిలో చేరకపోతే.

డాక్టర్ సుందరం, అబ్డామినల్ సర్జరీలో అందెవేసిన చెయ్యి. కన్నయ్య నాయుడు మంత్రిగారికి సాక్షాత్తూ తమ్ముడు. గొప్ప ఆస్పత్రిలో అందరికన్నా గొప్ప సర్జన్‌చేత ఆపరేషన్ చేయించుకోడానికి అతనికి తాహతుంది, హక్కుంది.

సుందరం ఇంజక్షన్ ఇచ్చినచోట మెల్లగా రాశాడు- వేళ్ళతో. జడ్జిగారు బట్టతలమీద వేలితో రాశాడు కాబోలు - రక్తం అంటుకుని ఉంటుంది వేలికి. కళ్ళ యెదట హత్య జరిగినట్టు ముఖం చిట్లించి చూసుకున్నారు వేలికేసి.

"అంచేత కన్నయ్య నాయుణ్ణి డాక్టర్ ఆత్మప్రభ హత్య చేసిందన్న సంగతి నిర్వివాదం" అన్నాడు ప్రాసెక్యూటర్. అది నిర్వివాదం అని రూఢిగా చెప్పడానికి నావంక వేలెట్టి చూపించాడు. నా చూపులు అతన్ని కలత పరిచినట్టున్నాయి. తప్పు చేసినట్టు ముఖం తిప్పుకుని పుస్తకాల వంక చూడ్డం మొదలెట్టాడు. నన్ను గురించి అందరూ ఎంత శ్రమపడుతున్నారు !

నేను చంపానని రాసిచ్చాక ఇంక ఎవరికీ ఏ ఇబ్బందీ ఉండదని ఆశపడ్డాను. కాని ఈ తంతు అంతా జరిగి తీరాలట - సుందరం అన్నాడు.

అతని వంక చూశాను. అతను ప్రాసెక్యూటర్ వంక చూస్తున్నాడు. సుందరం ముక్కు చక్కని వంపు - తెల్లని గోడముందు తీర్చిదిద్దినట్టుంది - ఏ చిత్రకారుడో గీసినట్టు. వాల్చిన ముఖంలో - కళ్ళు రెప్పల అడుగునుంచి ప్రాసెక్యూటర్ని దూసుకుపోయి, కాల దేశాలను అధిగమించి ఏవో దృశ్యాలను చూస్తున్నాయి. నాకు తెలుసు, ఆ దృశ్యా లేమిటో — నాకు తెలుసు.

"ముద్దాయి తరఫు వాదానికి కేసు జూలై 27 వ తేదీకి వాయిదా వెయ్యడమయింది" అన్నాడు జడ్జి.

అతని చెయ్యి తలమీదికి పోయింది. కోర్టువంక చూశాడు, చిరాకుగా లేచాడు. తృప్తితీరా చంద్రు గోక్కోడానికి వీల్లేదు కోర్టులో. కోర్టు ముగించి లేచాడు. చంద్రుకి మందేమిటో సుందరాన్నడిగి జడ్జికి చెపితే బాగుండును. సుందరమూ మరిచిపోయాడు వైద్యం. ఆపరేషన్ టేబిల్ దగ్గరకే వెళ్ళడం లేదట ఈ మధ్య.

*　　　　*　　　　*

నాన్నగారికి కడుపులో నొప్పొచ్చింది ఓ రాత్రి. నాకు తెలుసు కారణం. వీధులెంట పరిగెత్తాను. ఎటో తెలియదు, తెలుసు కూడా - నా కాళ్ళకి తెలుసు. సుందరం ఇంటిముందు ఆగాయి కాళ్ళు - తలుపు తట్టాయి చేతులు-సుందరం తెరిచాడు తలుపు. కుప్పగా కూలిపోయాను-వెక్కి వెక్కి ఏడుస్తూ.

సుందరం ఆపరేషన్ చేసేశాడు-మా ఇంట్లోనే - నాన్నగారి మంచం మీదే. ఆస్పత్రికి చేర్చడానికి వ్యవధి లేదు. నా చేతే మత్తుమందిప్పించాడు -

నే నప్పుడే ఆఖరి సంవత్సరం పరీక్ష రాశాను. ఏమయితేనేం - నాన్నగారు బతికారు.

అప్పుడు చూశాను ఆ వేళ్ళని - సుందరం వేళ్ళని. వాటిలో ఎంత చాకచక్యముంది. ఎంత సున్నితమైన కదలిక - ఎంత ఆత్మవిశ్వాసం ఉంది ఆ వేళ్ళకి! రెండు నిమిషాల్లో నాన్నగారి అపెండిక్సు పైకి తీశాయి ఆ వేళ్లు- మంత్రశక్తుంది ఆ వేళ్ళకి - యంత్ర సామర్థ్యం, నిర్దుష్టతా ఉన్నాయి ఆ వేళ్ళకి—

"మంచి ఎనీస్తటిస్టు వవుతావమ్మా!" అన్నాడు సుందరం.

మీదపడి కౌగలించుకుని నా కృతజ్ఞత చెప్పా లనిపించింది — ఆ కృతజ్ఞత, ఆ ఉత్సాహం, ఆవేశం -కేవలం నాన్నగారు బతికారనే కాదని తరవాత తెలిసింది నాకు.

అ రాత్రే ఆస్పత్రికి చేర్చాం నాన్నగారిని-పదిరోజులు రోజూ రెండు సార్లు వచ్చి చూసేవాడు సుందరం.

నాన్నగారిని స్ట్రెచర్‌మీదికి ఎక్కించేటప్పుడు - మొట్టమొదటిసారి- అతని వేళ్ళలో విద్యుత్తు - నా కళ్ళముందు పొగమంచు కప్పింది-నా నరాలు వశం తప్పాయి. అంబ్యులెన్సులోకి ఎక్కించేదాకా ఎలా నిలబడగలిగానో నాకే తెలియదు. అప్పుడు కళ్ళముందు పొగమంచు కటిక చీకటిగా పేరుకు పోయింది. సుందరం నన్ను పడిపోకుండా పట్టుకున్నాడు. అతని చేతివేళ్లు నా జబ్బల్ని బలంగా సున్నితంగా పట్టుకున్నాయి. ఆ స్పర్శతప్ప మరే జ్ఞానమూ లేదప్పుడు నాకు.

* * *

సుందరం మాకు వారానికి రెండు గంటలు-అనాటమీ - ఫిజియాలజీ పాఠం చెప్పేవాడు. అంతే క్లాసులో కాదు, హాస్పిటల్‌లో-రోగుల్ని పరీక్ష

చేస్తూ. నిజానికి అతను పట్టి ఆనరరీ సర్జన్ మట్టుకే. అయితే మా ప్రొఫెసర్ల కన్నా ఎంతో బాగా చెప్పేవాడు. గవర్నమెంటు ఉద్యోగం వద్దన్నాడు. మంత్రి ఎంతో బతిమాలాడు. కాని సుందరం ఒప్పుకోలేదు. తను స్వతంత్రుడుగా ఉండాలి - ఈ రెడ్ టేప్‌తో సంబంధం లేకండా. జీతం బత్తెం లాంటి ఇతర మొగమాటాలూ, వాటివల్ల వచ్చే మానసికమైన నిర్బంధాలూ, ఏవీ తన స్వేచ్ఛకి ఆటంకం కాకుండా, ఎంత సేవన్నా చేస్తానన్నాడు. హాస్పిటల్‌లో పెద్ద ఆపరేషన్లన్నీ అతనే చేసేవాడు. ఆ రోజుల్లో మా కతను మాస్టారు.

వందలకొద్దీ ఆపరేషన్లలో అతనికి సహకరించాను—హౌస్ సర్జన్‌గా చేరిన నాటినించీ - ప్రశాంత తీక్ష్ణమైన ఆ చూపులూ - ఒక్కసారైనా పొరబడని - తడబడని ఆ చేతులూ కొన్ని యుగాలుగా చూశాను - ముఖ్యంగా నాన్న ఆపరేషన్‌లో—

నాన్నని అతడు బతికించాడు - నేను చంపేశాను.

నేను ఇద్దరిని చంపేశాను – నాన్ననీ, కన్నయ్య నాయుణ్ణీ: ఎంతో మందిని మానసికంగా చంపేశాను - ముఖ్యంగా సుందరాన్ని - తరవాత మంత్రిని - పబ్లిక్ ప్రాసెక్యూటర్ని-జడ్జిని-ఎందర్నో.

ఎదురుగా జైలు కటకటాలు నల్లగా పెరిగి దూరంగానో దగ్గరగానో వచ్చాయి. కళ్ళ యెదట ఒకటే నల్లని తెరగా మూసుకునిపోయాయి. కళ్ళు మూసి నడుం వాల్చాను. కటికి కర్రమంచం వీపుని ఆనింది. నల్లని చీకటి పల్చబడి పొగమంచుగా మారింది. పొగమంచు ఆవరిస్తే ఎంత ప్రశాంతంగా ఉంటుంది!

నాకు బెయిల్ ఇప్పిస్తా నన్నాడు మంత్రి. అంటే సుందరానికి

కబురు పెట్టాడు. హత్య కేసులో ముద్దాయికి సామాన్యంగా బెయిలు యివ్వరట. నా కొద్దన్నాను. సుందరం ఎంతో చెప్పాడు. నే నొప్పుకో లేదు.

ఆ రాత్రి తరవాత, సుందరంతో - నే ఇంట్లో ఉండలేను. జైల్లో ఎంత ప్రశాంతంగా ఉంది!

సుందరం! పాపం సుందరం! అధికారులతో ఏ రకమైన మొగ మాటాలూ పెట్టుకోకుండా, పదవుల్లో ఉన్నవాళ్ళతో పరిచయం కూడా తగ్గిం చేసుకుని, పరిపూర్ణమైన మనస్స్వాతంత్ర్యం అనుభవించాలని సుందరం ఆశయం. నా మూలంగా అది వమ్మైపోయింది. చీకటి బజారులో పెతిడ్రిన్ కొంటున్నా డిప్పుడు-నా కోసం.

నాన్న బ్రహ్మ సమాజికుడు. సుందరం శుద్ధ వైజ్ఞానికుడు. దేవు డున్నాడని ఒప్పుకో డతను. కాని లేడని వాదించడు. అయితే ఏ విషయాన్ని గురించీ అతను వాద ప్రతివాదాల్లోకి దిగడు. ఇతరులు ఉద్రేకంతో వాదిస్తూంటే అతను మర్యాదగా చిరునవ్వు నవ్వి ఊరుకుంటాడు. చిత్ర మేమంటే మా పెళ్ళి తిరపతిలో జరిగింది. విగ్రహారాధనంటే మా నాన్నకి శుద్ధ వ్యతిరేకభావం. సుందరానికి అసలు దేవుడే లేడు. పెళ్ళి ఎక్కడన్న ప్రశ్న వచ్చినప్పుడు నేను తిరుపతి అన్నాను. సుందరం చిరునవ్వు నవ్వి, సరే నన్నాడు. నాన్న బొమలు ముడివేసి, క్షణం ఆలోచించి, "సరే నీ యిష్టం తల్లీ" అన్నాడు.

పెళ్ళయిన తరవాత ఒక వారం రోజులు తిరపతి కొండమీదే ఉన్నాం. ఆ వారం రోజులూ తిరపతి భూలోక స్వర్గం. చచ్చిపోయేవాకా అక్కడే ఉండిపోవా లనిపించింది నాకు. కాని సుందరం వెంటనే హైదరాబాదు చేరుకోవాలి. కన్నయ్య నాయుడు చావు బతుకలమీ దున్నాడు. మంత్రిగారు

ఒక టెలిగ్రాం ఇచ్చారు. రాత్రి పది గంటలలోగా మూడు ట్రంక్ ఫోన్లు చేశారు. మే మిద్దరం - సుందరం నేనూ - పాపనాశనం వేపు కాళ్ళనొప్పులు కూడా తెలీకుండా నడిచి నడిచి పది గంటల ప్రాంతానికి మా కాటేజ్ చేరుకున్నాం. మంత్రిగారి ప్లయిమత్ కారు వేచి వుంది మా కోసం. ట్రంక్ కాల్స్ వివరాలన్నీ మూడు పేజీలు అతి శ్రద్ధగా వ్రాసి పెట్టి ఉంచాడు దేవస్థానం అధికారి. కారులో హైదరాబాదు బయలుదేరాం.

కన్నయ్య నాయుడు తన తాలూకాలో మకుటంలేని రాజు: ప్రభుత్వంలో అతని పలుకుబడికి అంతులేదు. ఆప్తులకి ప్రాణమిస్తాట్ట. అవసరమైతే ప్రాణం తీస్తాట్ట. తన అన్నగారిని మంత్రిని చెయ్యకపోతే కూనీలై పోతా యని ముఖ్యమంత్రితో అన్నాట్ట. అయితే అతని అన్నగారు మహా హుందా అయిన మనిషి. నిప్పులాంటి వాడని ప్రతీతి. అతను మంత్రి కావడం అందరికీ ఇష్టమే.

కన్నయ్య నాయుడి ఆపరేషన్ అవుతూంటే లక్షలాది జనం ఉస్మానియా ఆస్పత్రి అవతల కాచుకుని ఉన్నారు. సుందరం, కన్నయ్య నాయుడూ ఇద్దరూ మృత్యుదేవతను ఓడించారు. డియోడినల్ అల్సర్ ఆపరేషన్. సారావల్ల, హద్దు మీరిన వ్యసనాలవల్ల, నాయుడు శరీరంలో సత్తువ సన్నగిల్లింది. రక్తం లేదు. మంత్రిగారు కంటతడితో, రుద్ధ కంఠంతో - 'చచ్చిపోయిన వాడికి ప్రాణం పోశారు,' అన్నాడు. సుందరాన్ని గట్టిగా కౌగలించుకుని వొదిలి పెట్టడం మరిచి పోయాడు. సుందరం అతన్ని బుజ్జగిస్తూ అన్నాడు: 'మీ తమ్ముడికి బతకాలన్న ఆశ అంత బలంగా ఉంది.'

ఆపరేషన్ తరవాత - అతను తేరుకుంటున్న రోజుల్లో - కన్నయ్య నాయుడు కళ్ళలో ఆపుకోలేనంత కామప్రకోపం నేను చూశాను, గుర్తించాను.

అయితే అతను మర్యాద నతిక్రమించి ఏమీ మాట్టాడలేదు. అసభ్యమైన సూచనైనా ఎన్నడూ చెయ్యలేదు. సుందరంతో ఒక రాత్రి నేను గ్రహించిం దంతా చెప్పాను.

"ఎంత నాగరికులమైనా మనలో పశు ప్రవృత్తి ఇంకా మిగిలివుంది. దాన్ని చూసి మనం సిగ్గుపడనక్కరలేదు: భయపడక్కర్లేదు" అన్నాడు. తరవాత మెల్లగా అన్నాడు, "కన్నయ్య నాయుడూ మనిషే—మహా భారీ మనిషి."

o o o

కంటి ఎదట ఇనప కటకటాలు ప్రశ్నార్థకాల్లా వంగాయి. ఎన్ని ప్రశ్నలు! ఎన్ని సమాధానం లేని ప్రశ్నలు ! !

సుందరం సలహాని కాదని నేను ఉద్యోగంలో ఎందుకు చేరాను? కడప నన్ను బదిలీ చేసినప్పుడు నేనెందుకు రాజీనామా ఇవ్వలేదు? కన్నయ్య నాయుడే ఈ బదిలీకి కారణమని నాకు తెలియదా? నిజంగా నేను తలుచు కుంటే అతను నన్ను పొందగలిగేవాడా? ఆ ఘోరం జరిగాక నే నెందుకు బ్రతికున్నాను? నిప్పులాంటి మంత్రిగారి చేత చెప్పరాని దారుణా లెందుకు చేయించాను? అతనిచేత తమ్ముణ్ణి ఎందుకు చంపించాను? ఇన్ని జరిగిన తరవాత, ఆ హత్య నా మీద ఎందుకు వేసుకున్నాను?

పొగమంచు దట్టమై ప్రశ్నలన్నీ కరిగిపోయాయి. మెదడులో సుత్తి దెబ్బలు - పెతిడ్రిన్ – పెతిడ్రిన్ – పెతిడ్రిన్ అంటూ మోగాయి. నా అరుపులు విని జైలు అధికారులు సుందరాన్ని పిల్చుకొచ్చినట్టున్నారు. సుందరం ఇంజక్షన్ ఇచ్చాడు. పొగమంచు పల్చబడింది. ఆ పల్చని తెర లోంచి సుందరం కంట్లో తడి చూచాయగా కనబడింది. సుందరం కంట తడి పెట్టడం ఎన్నడూ నేను చూడలేదు. నాలోని ఆవేశం కట్టు తెంచుకు ప్రవ

హించింది. అతన్ని గట్టిగా కౌగలించుకుని ఏడవాలని శరీరం తహతహ లాడింది. కాని అంతరాత్మ అది కూడదని ఆజ్ఞాపించింది. సుందరం నా వీపుమీద చేత్తో రాశాడు. చచ్చిపోయిన అమ్మ చెయ్యనిపించింది నాకు. ఆ స్పర్శలోంచి నిద్రమత్తు మెల్లగా పొగమంచులా ఆవరించింది మనస్సుని.

ం ం ం

ఆరేళ్ళుగా చుట్టూ తిరిగాడు కన్నయ్య నాయుడు. పిచ్చిగా తిరిగాడు. నే నే మాత్రం అవకాశ మివ్వకపో యేసరికి మరింత పిచ్చెక్కి పోయాడు. ప్రేమ పిచ్చిలో పడ్డ మగవాడు ఎంత మూర్ఖంగా కనిపిస్తాడు! పెంపుడు కుక్కకి యజమాన్ని చూడ్డంతోటే కళ్ళల్లోకీ, ముఖంలోకీ ఒక చిత్రమైన వెర్రి తనం, వెకిలి తనం ఎక్కణ్ణించో దిగుతాయి. నే నెక్కడ కని పించినా కన్నయ్య నాయుడు కళ్ళల్లో పెంపుడు కుక్క తనం తొంగి చూసేది.

సికింద్రాబాద్ క్లబ్‌లో ఎవరికో చటుక్కుని గుండెనొప్పి వచ్చింది. క్లబ్‌లో పేకాడుతున్నాట్ట సుందరం. వెంటనే ఆక్సిజన్ సిలిండర్ - మా ఇంట్లో ఉన్నది - తెమ్మని ఫోన్ చేశాడు. నేను తీసికెళ్ళాను. రోగి తేరు కున్నాడు. సుందరం తన కారులో అతన్ని హాస్పిటల్‌కి తీసికెళ్ళాడు. నే నింటికి పోతుంటే, కన్నయ్య నాయుడొచ్చి తనకి కారు లేదనీ, తనని వాళ్ళ అన్నయ్య ఇంటి దగ్గర దించమనీ అడిగాడు. వొద్దనడం ఎలాగో తెలియ లేదు. అతను కార్లో ఎక్కుతుండగా సారావాసన గుప్పున కొట్టింది. అయితే ఆ వాసన నాకు కొత్త కాదు. సుందరమూ తాగుతాడు, అప్పుడప్పుడు. కాని కన్నయ్య నాయుడు నోట్లోంచి ఆ వాసన జులాయిగా వచ్చింది. హుసేన్ సాగర్ గట్టుమీంచి పోతూండగా అతని చెయ్యి నాకు జబ్బమీద తడిగా వేడిగా తగిలింది. గొంగళీ పురుగు పాకినట్టు నా వొళ్ళంతా జలద

రించింది. చటుక్కున అతను చెయ్యి తీసేశాడు. ఒక్క క్షణం ఆగి అన్నాడు :

"డాక్టర్, ఓ గంట బోట్లో....అలా....అలా...."

అతను నా ముఖం చూసి వాక్యం పూర్తి చేయలేకపోయాడు. లోపల లోపల అతను కాలిపోతున్నాడు. నేను కారు ఆపాను.

"కన్నయ్య నాయుడుగారూ, మీ రడిగినదే తడవుగా వచ్చే ఆడవాళ్ల చాలా మందుంటారు. వాళ్ళతో తృప్తి పడండి. నాకోసం ప్రయత్నిస్తే మీకు మిగిలేది మన స్తాపం ఒక్కటే—"

కన్నయ్య నాయుడు తన్ను తిన్న కుక్కలా కారు దిగి వెళ్ళి పోయాడు.

రాత్రి సుందరంతో ఈ ఘట్టం అంతా వివరంగా వర్ణించి చెప్పాను. సుందరం హాయిగా నవ్వాడు.

"అత్మా! ఒక ప్రసిద్ధ చిత్రకారు డేమన్నాడో తెలుసా: కామం - ప్రకృతి సహజమైనదీ, ఆరోగ్యకరమైనదీ. ప్రేమ ఒక పెద్ద జబ్బు"- అన్నాడు. ఎంత పెడసరంగా చెప్పినా అందులో కొంత నిజం వుంది.

నాకు అరికాలిమంట నెత్తి కెక్కింది.

"అవున్లే—కన్నయ్య నాయుడెంత ఆరోగ్యమైన మనిషో నీకూ నాకూ తెలుసు!" అన్నాను వెటకారంగా.

సుందరం నవ్వి ఊరుకున్నాడు సమాధానంగా.

o o o

తీర్పు ఆ రోజుని చెపుతారని లాయరొచ్చి చెప్పాడు. ఆ రోజు

సుందరం నన్ను చూడ్డానికి రాలేదు. కటకటాల మధ్య ముఖం పెట్టి ఎన్ని యుగాలు చూశానతని కోసం!

"మన మిద్దరం జీవితంలో సమాన భాగస్వాములం. స్వతంత్రులం. నువ్వు మీరనీ నేను నువ్వనీ పిలవడాలు నే నొప్పుకోను. నువ్వు మీరు మీ రంటే, నేనూ మీరు మీరంటాను" అన్నాడు సుందరం—పెళ్ళయిన రోజుని. అప్పటినించీ సుందరాన్ని మన్నించడం మానేశాను.

"నీకు పిల్లలు కావాలా?" అని అడిగాడు-మేం ఏకాంతంగా తిరుపతి కాలేజీ వరండాలో కూర్చున్న మొదటి రాత్రి. అప్పుడు నేను కొత్త పెళ్ళి కూతుర్ని. నాకేం చెప్పడానికీ తోచలేదు. సిగ్గుపడి చచ్చిపోయాను. సుందరం నన్ను బుజ్జగిస్తూ అన్నాడు-

"నాతోబాటు నువ్వు కూడా వైద్యం చెయ్యదలుచుకుంటే పిల్లలు చాలా పెద్ద బెడద. వైద్యం మానేసి ఇల్లూ పిల్లల్నీ చూసుకుంటానంటే సరే."

"వైద్యం చేస్తా, కొన్నాళ్ళు-" అన్నాను. అప్పుడు నా చేతులో పెట్టాడు పెస్సరీ—పేస్టున్నూ —

అది మొదలు ప్రతి రాత్రీ ధరించాను- అవసరమున్నా లేకపోయినా. అది నా దినచర్యలో భాగమైపోయింది. హైదరాబాదులో ఉన్నన్నాళ్ళూ ఒక్కరోజు మరిచిపోలేదు. సుందరం ఊళ్ళో లేకపోయినా ధరించేదాన్ని అలవాటు కొద్దీ.

అటువంటి అలవాటు-కడపలో- ముఖ్యంగా ఆ రాత్రి ఎందుకు భంగ మైంది? అసలు కడప యెందుకు వెళ్ళాను నేను? సుందరాన్ని ఎలా వొదిలి పెట్టగలిగాను?

* * *

సుందరానికి ఎదురుగా కూర్చున్నాడు మంత్రి. ఇంకా జడ్జి రాలేదు.

అతని తలమీద చంద్రుడు పెచ్చు చూడాలని నా కొకటే ఆత్రం.

మంత్రి నావంక రెప్ప ముయ్యకుండా చూస్తున్నాడు. పల్చని పొగ మంచు పొర వెనక-అతని కళ్ళలో రేగుతున్న ప్రళయమైన తుఫాను కన బడింది. సుందరం వంక చూశాను. అతని కళ్ళెంత ప్రశాంతంగా ఉన్నాయి! ప్రేమలో, విషాదంలో, ఆవేశంలో, ఆనందంలో, మధనలో, ఉద్వేగంలో ఆ కళ్ళలో ప్రశాంతి అలాగే ఉంటుంది. సృష్టిలోకి అవసరమైనది అదొక్కటే.

* * *

పెదవులమీది చిరునవ్వు చెదరకుండా, కళ్ళలోతుల్లో గాంభీర్యం, ప్రశాంతీ కదలకుండా ఎంత తాపీగా ఎన్ని ప్రశ్నలు వేశాడు! సమాధానం తెలియని ప్రశ్నలు! చెప్పలేని ప్రశ్నలు! ప్రశ్నల్లోనే సమాధానాలున్న ప్రశ్నలు! నన్ను మొదలంట కదిపి వేసిన ప్రశ్నలు!

ప్రజాసేవ చెయ్యాలంటే-ప్రభుత్వోద్యోగంలోనే చేరాలా?

ప్రజాసేవ కడపలోనే చెయ్యాలా? హైదరాబాదులో ప్రజలు లేరా?

ఈ కడప ఉద్యోగం—కన్నయ్య నాయుడి పన్నాగమని తెలియదా?

అతన్నెందుకు అనవసరంగా రెచ్చగొట్టడం?

అతన్ని ఆశపెట్టి ఆ తరవాత బాధపెట్టడం ఎందుకు?

ఈ పోటీలో అతనిమీద విజయం సాధించాలన్న ఆత్రం నీ కెందుకు?

అసలు అతన్ని గురించి ఇంతగా పట్టించుకోడం దేనికి?

నీ మనస్సుని నువ్వు తరిచి చూసుకున్నావా?

నీమీది ప్రేమకు అతను బానిస అయ్యాడన్న గర్వం నీలో లేదా ?

అంతటి పలుకుబడిగల మగధీరుణ్ణి పురుగులాగ నేలకు పెట్టి రాయా లన్న ఆవేశం కొద్దీ చేస్తున్నావా ఈ పని !

నా ఉద్దేశాన్ని శంకించినందుకు, నా పవిత్రతని అనుమానించినందుకు అతనిమీద ఉవ్వెత్తుగా లేచాను. ఏడిచాను - ఆవేశపడ్డాను - నా లోలోపలి రహస్యాల్ని బయటికి లాగాడన్న ఉక్రోషం, సిగ్గూ, అవమానం నన్ను దహించాయి.

నీ కిష్టం లేకపోతే మానేస్తానన్నాడు.

నీ కిష్టమయితే వెళ్ళమన్నాడు.

చర్రున బయలుదేరాను - కడప.

*　　　*　　　*

అబ్బ! ఏమిఁ రోజు లవి? ఎంత పిచ్చి రోజులవి ? ఎంత గుడ్డి రోజులు! కన్నయ్య నాయుడు నిజంగా పెద్దమనిషి. అతన్ని జంతువుగా మార్చింది నేను. కొంటెచూపులు చూశాను. నవ్వాను. పలకరించాను. తీరా నేను కడప వచ్చాక అతను నా దగ్గరకు రాకపోయేసరికి నిరుత్సాహ పడ్డా నేమో కూడా-నా అంతట నేనే - కావాలని అతన్ని కలుసుకోడానికి సూక్ష్మమైన పన్నాగాలు పన్నాను. దగ్గరకు రాగానే దూరంగా నిల బెట్టాను.

"డాక్టర్! మిమ్మల్నిక్కణ్నుంచి బదిలీ చేయిస్తాను. వెళ్ళిపొండి" అన్నాడు అతి దీనంగా, బతిమాలుతున్నట్టు- ఈ బాధ భరించలేక.

"బదిలీ చేయిస్తే, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఇక్కడే ప్రాక్టీసు

పెడతాను. కడపంతా మీ సొంత సామ్రాజ్యం అనుకుంటున్నారా?" అన్నాను కసిగా.

౦ ౦ ౦

జడ్జి తీర్పు చదువుతూ చదువుతూ, బొమలు ముడివేసి చంద్రు పెచ్చు ఎడమచేతి చూపుడువేలి గోరుతో పెల్లగించాడు. కుడిచేతిలో తీర్పుంది పాపం. ఆప్యాయంగా దానివంక చూసుకుంటూ ఒక చిటిక ఆగాడు. అస హ్యంగా దాన్ని కోర్టువేపు మీటేసి మళ్ళీ చదవడం మొదలెట్టాడు.

"ముద్దాయి తరపు వకీలు మహాశయుడు, ఈ హత్య ఆత్మరక్షణ కోసం జరిగి ఉండవచ్చునని సూచించారు. అయితే డాక్టర్ ఆత్మప్రభ – కడపలో—జూన్ 16 వ తేదీ రాత్రి - కన్నయ్య నాయుడు తనను మత్తుపెట్టి ట్రావెలర్స్ బంగాళాకు రప్పించి మానభంగం చేసినప్పుడు ...." అపును అప్పుడు నేనెందుకు చంపలేదు ? దానికి సమాధానం నాకే తెలియనప్పుడు, పాపం జడ్జికి ఏం తెలుస్తుంది ? మా వకీలు ఎంత ఉద్రేకంతో వాదించాడు! !

"డాక్టర్ ఆత్మప్రభ, అతి పవిత్రమైన వాతావరణంలో పెరిగిన అబల. భర్తనే దైవంగా ఎంచుకునే భారత నారీమణి...."

* * *

ఒకటి రెండు మూడు నాలుగు- దిగేటప్పుడు నాలుగు మెట్లు – కడప ఆస్పత్రి భవనానికి. ఎక్కేటప్పుడు నాలుగు, మూడు, రెండు ఒకటి.ఎప్పుడూ లెక్కపెట్టేదాన్ని. లెక్క నోటితో కాదు-కాళ్ళతో. ఆ రోజునీ-జూన్ పద హారు శుక్రవారం సాయంకాలం ఏడుగంటలకి నా కళ్ళు లెక్కపెడుతూ దిగాయి-నాలుగు, మూడు, రెండు, ఒకటి. లెక్క తగ్గుతున్న కొద్దీ సుంద రానికి దగ్గరగా వస్తూన్నట్టు పిచ్చిభ్రమ. ఇంటికి చేరుకునేసరికి సుందరం

వొచ్చి ఉంటాడని వెర్రి ఆశ, ఆత్రం. నాలుగు మెట్లు దిగేలోగా నలభై కలలు.

ఇంట్లో అడుగు పెట్టేసరికి సుందరం ఉప్పెనలా వచ్చి నన్ను ముంచేస్తాడు.

నాకు ఊపిరి సలపనివ్వడు.

నరనరాలు ఆవేశంతో, ఆనందంతో పిచ్చెక్కిపోతాయి.

తప్పకుండా ఒచ్చి ఉంటాడు సుందరం.

ప్రతి సాయంత్రం ఆస్పత్రివించి మెట్లు దిగేటప్పుడు ఇవే ఆలోచనలు - రిక్షా మువ్వలు సమతాళంలో నాలుగు, మూడు, రెండు, ఒకటి లెక్కపెట్టుకుంటూ ఇంటివేపు పోతుంటే ఇవే ఆలోచనలు.

ఈవేళ పెస్సరీ ధరించడం మరచిపోయాను.

ప్రతిరోజూ కావాలనే మరచిపోయాను.

వ్యాధిక్రిములను చంపడానికి వందలకొద్దీ, వేలకొద్దీ డాక్టర్లున్నారు. మరొక సుందరాన్ని, మరి పదిమంది సుందరాల్ని, ఈ లోకానికి ప్రసాదించడానికి, ఇంకెవరున్నారు—నేను తప్ప?

కడుపంతా కాళీ అయి ఎంతో హాయిగా బాధపెట్టేది. ఆ వెలితి నిండాలి. కడుపులో వెలితి నిండాలి. వైద్యవృత్తి మానేస్తాను. పిల్లల్ని కంటాను. పిల్లలు, పిల్లలు....అందరూ సుందరం ప్రతిరూపాలు.

అయితే ఒక్క సాయంత్రం కూడా కల నిజం కాలేదు. ఇల్లు కాళీగా నన్ను ఆహ్వానించేది - బావురుమంటూ. కడుపులో కాళీగా ఆక్రోశించేది.

చిత్రం. ఆ కాళీ నింపింది కన్నయ్య నాయుడు.

ం ం ం

నాలుగు, మూడు, రెండు, ఒకటి మెట్లు దిగాను. రిక్షాలేదు. కారుం డొకటి. సుందరం వచ్చాడన్న ఆశ ఒక్కసారి గంతులేసింది.

"రిచ్చా నానే పంపేశా నమ్మగోరు - అయ్య పంపేడు - అమ్మకి నొప్పులు. పెమాదం గుందంట; తమర్ని పిలుసుకొచ్చీమన్న డయ్య."

పడమటి జిల్లాల్లో తూర్పు భాష ఎంత అసందర్భంగా ధ్వనించింది. కారెక్కాను. ఊరడగలేదు, పేరడగలేదు. కార్లో నా పక్కని సుందరం అకస్మాత్తుగా మూర్తీభవిస్తాడని పిచ్చిభ్రమ. భ్రమ నిజం కావాలని కళ్ళు మూసుకున్నాను.

ఆ కారు కన్నయ్య నాయుడు పంపుంటాడని నా కెందుకు తోచలేదు? తోచినా లక్ష్యపెట్టలేదా ఒకవేళ?

తెలిసే కార్లో ఎక్కానా ఒకవేళ?

కళ్ళు తెరిచేసరికి నిజనమైన రోడ్డు పక్కన టి. బి.

కళ్ళు చెదిరాయి. మనసు అదిరింది.

మొండి పట్టుదలతో లోపలికి వెళ్ళాను. విస్కీ, చెమట, మాంసం, మసాలా కలగలిపిన చవకబారు వాసన, అసభ్యమైన వాసన. జంతుశాలలో పులులూ, సింహాల కంపు గుర్తు కొచ్చింది. కొంచెం తూలానేమో, రెండు జబ్బలు నన్ను పట్టుకున్నాయి. పది చేతులు నన్ను మంచానికి కట్టేశాయి — గింజుకున్నాను. ఆవరించిన మంటల్లోంచి బయటపడ్డానికి నరనరాలు తహ తహలాడాయి. పైకి తేలి గాలి పీల్చుకోవాలి. మునిగిపోతున్నాను - అది నీరుగాదు - నీటి మంటల ప్రవాహం. పగిలిన విస్కీబుడ్లు, చిరిగి చిందరై

పోయిన గుడ్డలు, రక్తం, మాసం, మసాలా. దాహం, దాహం. ఒకటే దాహం - అసహాయత, వివశత - పెస్సరీ కూడా లేని అబలత. వాసన నా ముక్కుకి అలవాటైంది. ఎన్నడూ ఎరగని నిశ్శబ్దం. స్మశాన ప్రశాంతి.

ఆత్మప్రభలో ఆత్మ చచ్చిపోయింది.

బెదురూ, పశ్చాత్తాపం, క్షమార్పణా కలిగిన గొంతుకతో "ఇంటికి వెడతారా?" అన్నాడు కన్నయ్య నాయుడు.

"హైదరాబాదు" అన్నాను వినపడీ వినపడకండా.

o o o

"మంత్రిగారితో చెపితే మాత్రం ఆయనేం చెయ్యగలడు?" అన్నాడు సుందరం.

"ఇంత దారుణం జరిగాక ఊరుకోమంటావా? ఈ ప్రజానాయకుల జులుముకి మంచీ, మర్యాద, సభ్యతా, పవిత్రాలన్నీ బలై పోవలసిందేనా?" సుందరం జాలిగా నవ్వాడు. ఉప్పెనలా వొచ్చింది ఏడుపు. శరీర మంతా ఊగిపోయింది. సుందరం మెత్తగా దగ్గరగా తీసుకున్నాడు. మైల బట్టలతో దేవుణ్ని తాకినట్టు అదిరిపోయాను. విడిపించుకుని దూరంగా పారి పోయాను.

"మైలపడ్డ ఈ శరీరాన్ని నువ్వు తాకొద్దు. తాకితే నేను భరించ లేను."

"పిచ్చిదానా శరీరం మైలపడ్డం ఏమిటి? మనసులో మాలిన్యం లేనప్పుడు, వ్యక్తికి మైల అంటదు. ఈ జరిగిన పీడకల మన మధ్య అడ్డు రాదు - రాకూడదు. నీ మీద ఒట్టు. ఏం జరిగినా నువ్వు నా ఆత్మవే. నా వంక చూడు. నా చూపుల్లో ఏవ(న్నా. ఈగ రెక్కంతన్నా తేడా ఉందేమో

చూడు:" అన్ని వాక్యాలు వరసగా మాట్లాడ్డం అదే మొదటిసారి. కాని అతని మనస్సులో తేడా లేకపోయినా నా మనస్సులో పెద్ద తెర-ఇనప తెర-అతన్నీ నన్నూ విడదీసింది.

నా బలవంతంమీద మంత్రి దగ్గిరికి తనూ వొచ్చాడు.

మంత్రి చంటిపిల్లాడిలా విలవిల ఏడ్చాడు.

"డాక్టర్ సుందరం, నన్ను మీరు బాగా ఎరుగుదురు. అన్యాయాన్ని నేనూ సహించలేను. కాని వాణ్ని నే నేమీ చెయ్యలేను. మీరు కేసు పెడితే వాడు తప్పించుకోడం మాత్రం ఖాయం. అధికారులంతా వాడి చేతులో కీలు బొమ్మలు-మంత్రిగా ఉంటూ నే నీ మాట చెప్పడానికి నాకే సిగ్గుగా ఉంది.... నేను రాజీనామా యిచ్చేస్తాను," అన్నాడు.

"వద్దు. మీలాంటి వారు పదవిలో ఉంటే దేశానికి క్షేమం. ఒక వ్యక్తికి జరిగిన అన్యాయానికి దేశం నష్టపోవడం న్యాయంకాదు," అన్నాడు సుందరం.

o o o

జడ్జీ చదువుతున్నాడు-అదేదో అతిలోకమయిన మంత్ర పఠనంలా ధ్వనిస్తోంది-పొగమంచు తెరల్లోంచి.

"డాక్టర్ ఆత్మప్రభ-తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం కోసం ప్రయత్నించిన సంగతి సాక్ష్యం ద్వారా బలంగా రుజువైనదని కోర్టువారి నమ్మకం...."

o o o

ప్రతీకారం, ప్రతీకారం, ప్రతీకారం.

మంత్రివంక చూశాను. అతని కళ్ళ లోతుల్లో అతని మంచి తనపు కంకాళం-పొగమంచు దుప్పటికింద పడుకుని వుంది.

o o o

"ఇంజక్షన్ ఇయ్యి-" అన్నాను సిరంజి సుందరాని కిస్తూ.

"భ్రూణ హత్యా!" అన్నాడు సుందరం. అది మా నాన్నగారి భాష-సుందరం సంతాన నిరోధానికి అనుకూలుడు. నాన్న బ్రతికున్న రోజుల్లో ఇద్దరికీ పెద్ద చర్చలు జరుగుతూండేవి. ఈ విషయమయి అయితే నాకు గర్భస్రావం చెయ్యడానికి అత నొక పట్టాన్ని అంగీకరించలేదు.

"నా మాట విను. ఈ బిడ్డ పుడితే నీ కెంతో మనశ్శాంతి కలుగుతుంది. ఆ బిడ్డని చూసుకుని వెనకటివన్నీ మరిచిపో గలుగుతావు," అంటూ ఎన్నో విధాలా వాదించాడు.

"కన్నయ్య నాయుడు బిడ్డని కనాలా నేను?!" అన్నాను. నా గొంతు అప్పుడు ఎవరిదోలాగా అనిపించింది.

"నీ ఇష్టం ప్రభా!" అన్నాడు సుందరం. నాలో ఆత్మ లోపించింది. అతని పిలుపులో ఆత్మ లోపించింది. అది ఇంక తిరిగిరాదు, తిరిగిరాదు. గర్భస్రావం సాఫీగా లేదు, వికటించింది. నే నప్పు డెందుకు చనిపోలేదు? అందర్నీ చంపడానికి నే నెందుకు బ్రతికాను.

అప్పుడిచ్చిన పెతిడ్రిన్-నా మనస్సుని మెత్తని మెల్లని పొగమంచుతో కప్పిన పెతిడ్రిన్.

ఎన్నడూ చట్టం అతిక్రమించని సుందరం కూడా రెండు నేరాలు చేశాడు—భ్రూణ హత్య - చీకటి బజారులో పెతిడ్రిన్ కొనడం. నాలాగే అతనూ మైలపడ్డాడు. నా పరిచితులందరూ అపవిత్రు లయారు. మంత్రి సంగతి చెప్పనక్కరలేదు.

o o o

లోకాని కెంత చెడ్డగా కనిపిస్తే నా కంత సంతృప్తి. రిక్షాల్లో పోయినా భార్యలు నన్ను చూసి అదిరిపోయేవారు-నా చిరునవ్వుకి తమ భర్తలు ఎక్కడ దాసులై పోతారో నని - హైదరాబా దంతా నా ఆధీనంలో ఉంది. మంత్రిగా రింట్లోనే మకాం. పేరుకి ఆయనకు డాక్టర్ని. నిజం అందరికీ తెలుసు. లక్షలు లంచాలు పుచ్చుకున్నా - ఫోనుమీద వ్యాపారం — అంతా మంత్రి పేర. మంత్రికి ఈ సుడిగుండంలోంచి బయట పడాలని ఒకటే ఆత్రం—శ్లేష్మంలో పడ్డ ఈగలా గిలగిల కొట్టుకునీవాడు - నా కెంత తృప్తి. ఎంత కడుపు నిండినట్టుండేది! ఆనాడు కడప టి. బి.లో నేను పడ్డ అవస్థ ఇతరులు పడుతుంటే చూసి ఆనందించాలి. ముఖ్యంగా మంత్రీ, కన్నయ్య నాయుడూ. నిజాయితీ వట్టి నటన, పవిత్రత వట్టి భ్రమ - ఈ నిజం బయట పెట్టిన ఘనత డాక్టర్ ప్రభది. నాగరకత జీవితం నిండా బూటకాలు - అసలు మనిషి వట్టి జంతువు. నాగరికత వేసిన సంకెళ్ళు తెంచుకుని మనిషిలో జంతువు వీరవిహారం చెయ్యాలి—అదొక విశిష్ట వేదాంతం - పొగ మంచులోంచి అవతరించిన దర్శనం.

o o o

సుందరం చెయ్యి కుడిపక్క జేబులోకి పోయింది-పెతిడ్రిన్ కోసం. నే నక్కర్లేదని తల ఊపాను. మరొక్క నాలుగు పుటలు-నా జీవితం అంత మైపోతుంది. నలభై మన్వంతరాల నా జీవితాన్ని నలభై పుటల్లో సంక్షిప్తం చేశాడు జడ్జి. అయితే నిజం అతనికి తెలియదు. తెలుసుకోలేదు. నాకూ తెలియదు పూర్తినిజం. దానిచుట్టూ పొగమంచు అలుముకు పోయింది. ఒక్క సుందరానికే తెలుసు నీడలేని నిజం. నీడల్ని తొలగించి చూడగలవు అతని కళ్ళు. క్రమంగా నా చైతన్యం పేరుకుంటోంది - పెద్ద సమాధి నిర్మాణ మౌతుంది-ఇంకొక్క మూడు పేజీలు-

"డాక్టర్ ఆత్మప్రభ - మంత్రిగారింటి దగ్గర ఉండగా కన్నయ్య నాయుడు అక్కడికి వచ్చాడని సాక్ష్యం ద్వారా రుజువైంది. ఆమె తనకు కాకుండా పోతోందని అతను ఆవేశపడ్డట్టు- ఇంచుమించు పిచ్చివాడిలా ప్రవర్తించినట్టు మంత్రిగారి సాక్ష్యంవల్ల తెలుస్తోంది" జడ్జి చిరాకుగా చుంద్రు పెచ్చు గోక్కున్నాడు.

న్యాయానికి ఎంత మర్యాద! ఎంత సభ్యత ! అన్నదమ్ము లిద్దరూ నా కోసం సుందోప సుందుల్లా కొట్లాడుకున్నారని జడ్జికి తెలుసు. ఇద్దరినీ ఒళ్ళు మరిచిపోయే స్థితికి రెచ్చగొట్టింది నేనని కూడా తెలుసు. కాని అది కేసుతో సంబంధమున్న వివరం కాదు. నన్ను కాపాడ్డానికి కంకణం కట్టుకున్న మా వకీలు కూడా మంత్రిగారిని క్రాస్ ఎగ్జామిన్ చేసేటప్పుడు అట్టే ఒత్తిడి చెయ్యలేదు. మంత్రిగారి మర్యాద కాపాడాలి. అందరూ కలిసి పదవియొక్క గౌరవం కాపాడాలి. సమాజంలో, నాగరిక సమాజంలో వ్రాసిపెట్టని నియమావళిలో అదొక్కటి. కాని నేను మంత్రి మర్యాదని మంట కలిపేశాను. నిజంగా ఏం జరిగిందో అందరికీ తెలుసు. సమాజంతోపాటు నేను నాటక మాడుతాను. పోయిందేముంది. ఇంతటి ఘనవిజయం సాధించాక నేను ఉదారంగా ప్రవర్తించవచ్చు.

"కన్నయ్య నాయుడు గుండెల్లోంచి తీసిన పిస్తోలు గుండు, డాక్టర్ ఆత్మప్రభ చేతనున్న పిస్తోల్లోంచి వచ్చిందేనని పరీక్షవల్ల తేలిన విషయం-"

మంత్రి ముఖం నీలంగా మారిపోయింది - పొగమంచు దట్టమైంది. నీలిముఖంలో నల్లని నుదుటిరేఖలు చిక్కబడ్డాయి-పెదవిమీది మీసం బాధగా అదిరింది. ముక్కు- షోణాలు ఆత్రంగా కష్టంగా పెరిగి తరిగాయి - ఎంత పీల్చినా గాలి రానట్టు బాధపడ్డాయి.

"ఆగండి, యువర్ ఆనర్! మా తమ్ముణ్ని చంపింది నేను – నేను. మేమిద్దరం దున్నపోతుల్లా కొట్టుకున్నాం – కిందపడి పిస్టల్ కోసం పెనుగులాడాం. అది ఎవరికి దొరికినా రెండోవాడికి చావు తప్పదు. నాకు దొరికింది."

మంత్రికి ముచ్చెమటలూ పోశాయి. కోర్టంతా లేచింది. నేనూ సుందరం మాత్రం కూర్చునే ఉన్నాం.

"ఒక నిర్దోషికి శిక్ష పడుతుంటే చూస్తూ ఊరుకోలేక!"

భయంకరమైన నిశ్శబ్దం. దాన్ని చీలుస్తూ "ఢాం" అని పిస్టలు మోత. మంత్రి కణతమీదినుంచి పిస్టల్ తీశాడు. కోర్టుకు మధ్య కుప్పగా కూలిపోయాడు.

చర్రున లేచాను. గోల, కోలాహలం. బ్రహ్మాండాలు బద్దలౌతున్నట్టు. సుందరం వేళ్ళు జబ్బని పట్టుకున్నాయి. సూది చురుక్కుమంది. కాని ఇప్పుడు కళ్ళఎదట కమ్మిన పొగమంచు పేరు. ఇందులో హాయి లేదు. అస లే అనుభవమూ లేదు. మనస్సులో కదలిక లేదు. సమాధి లోలోపల పెరిగి పర్వతంలా పేరుకుంటోంది – గోల – కోలాహలం యోజనాల దూరాన్నించి వినబడుతున్నాయి. వాటిమధ్య ఒక్కటే స్పష్టమైన గొంతు – సుందరానిది.

"ఆత్మా! ఆత్మా!" అంటూ ఆక్రోశించింది.

ఒక చిటిక తరవాత అదీ వినబడలేదు.

(యువ, దీపావళి)